E69 NEWS

# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు    జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో

పని చేయుటకు నియోజకవర్గాలవారీగా

విలేకరులు కావలెను వాట్సాప్ నెం:

9959812941-9949356387

PUBLISHED: TELANGANA, HYDERABAD, JANGAON | సంపుటి :01 | సంచిక :01 | మంగళవారం 02 జూన్ 2026 | ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్ | పేజీలు: 04 | వెల :05/-

### రాష్ట్రంలో మరో రెండున్నర లక్షల

# ఇందిరమ్మ ఇళ్లు

### : సీఎం రేవంత్‌రెడ్డి


2 లో

కాగజ్‌నగర్, తెలుగు గళం: ఆదిలాబాద్ ప్రాంత అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. ఆదిలాబాద్ ఆదివాసీల సొంతింటి కల నెరవేరాలని ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున పేదలకు మంజూరు చేయాలని నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. కాగజ్‌నగర్‌లో పర్యటించిన సీఎం.. పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడారు. "తండాలు, గూడేల్లో ఉండే అర్హులైన ఆదివాసీ బిడ్డల కోసం స్పెషల్‌డ్రైవ్ నిర్వహించి నూరు శాతం ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి. గుడిసెలు లేని ఆదిలాబాద్ జిల్లాను నేను చూడాలనుకుంటున్నా. రాష్ట్రంలో సెప్టెంబర్ 17న మరో లక్ష గృహప్రవేశాలు చేస్తాం. కొత్తగా మరో రెండున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లను ఈ వేదిక నుంచే మంజూరు చేస్తున్నట్లు ప్రకటిస్తున్నా.

# బీజేపీలో ముదురుతోన్న అంతర్గత పోరు

## కమలదళం చీలిందా?



2 లో

న్యూస్ డెస్క్, 01 జూన్ (తెలుగు గళం): బీజేపీలో అంతర్గత పోరు నానాటికీ ముదురుతోంది. ఆధిపత్య పోరులో ఒకరిపై మరొకరు పైచేయి సాధించేందుకు కొందరు నేతలు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే పార్టీ పరువు, ప్రతిష్ఠను రోడ్డుకు ఈడుస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రత్యర్థులను అణిచివేయడమే లక్ష్యంగా దుష్ప్రచారం చేస్తున్నారని టాక్ వినిపిస్తోంది. క్రమశిక్షణకు మారుపేరుగా ఉండే బీజేపీ పార్టీ ట్యాగ్ లైన్‌కు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కీలకనేతల మధ్య జరుగుతున్న ఆధిపత్య పోరు కారణంగా కేడర్?తీవ్ర ఆందోళనకు గురవుతోంది. ఇప్పుడిప్పుడే రాష్ట్రంలో పార్టీకి మైలేజ్ వస్తున్న క్రమంలో నేతల తీరు వలన నష్టం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర నాయకత్వం ఇక్కడి పరిస్థితిపై దృష్టి సారించి సమస్యను పరిష్కరించేలా చూడాలని కేడర్ కోరుతోంది.

ూశ్రీంశీ =ఘ్రు - పిడుగుపాటు బాధితులకు అండగా ప్రభుత్వం : మంత్రి జూపల్లి కృష్ణారావు

ఈటల రాజేందరే టార్గెట్..

బీజేపీలో గత కొంతకాలంగా పాత, కొత్త వివాదం రాజుకుంది. పార్టీలోని కొందరు తాజాగా ఎంపీ ఈటల రాజేందర్ లక్ష్యంగా తీవ్ర ఆరోపణలు, విమర్శలు చేస్తూ పోస్టర్లు వేశారు. ఇది కేంద్రమంత్రి బండి సంజయ్?వర్గానికి చెందిన కొందరి పని అంటూ ఈటల అనుచరులు ఆరోపిస్తున్నారు. నిజామాబాద్?ఎంపీ అర్వింద్, ఈటల కొంతకాలంగా సాన్నిహిత్యంగా ఉంటున్నారని.. దీంతో వారిని లక్ష్యంగా చేసుకొని వారిమధ్య గ్యాప్ వచ్చేలా పోస్టర్‌ను ముద్రించారని ఈటల అనుచరులు ఆరోపిస్తున్నారు. అయితే, బండి సంజయ్ కొడుకు భగీరథ్ మీద పోక్సో కేసు కావడంతో కేంద్రమంత్రి, ఈటల, అర్వింద్ మధ్య వివాదం మరింత ముదరిందని పార్టీ నాయకులు చెబుతున్నారు. బండి రాష్ట్ర అధ్యక్షుడిగా దిగిపోవడానికి పరోక్షంగా ఈటల, ఇతర నేతలు కారణమంటూ బండి అనుచరులు ఆరోపిస్తున్నారు.

# గ్రామాలకు స్వేచ్ఛ

సొంత నిధుల వినియోగం

ట్రెజరీకి గుడ్‌బై

సర్పంచ్‌కు చెక్ పవర్

కార్యదర్శికి అధికారం

స్థానిక నిధులు..స్థానిక పనులు

రూ.140 కోట్లపై పట్టు

చట్ట సవరణకు కసరత్తు

ఉపసర్పంచ్‌కు చెక్

బ్యాంకు ఖాతాల్లో నిధులు

ఈ-పంచాయత్ పర్యవేక్షణ

పారదర్శక ఖర్చులు

తప్పనిసరి ఆడిట్

అవినీతిపై ఉక్కుపాదం

పల్లె పాలనలో కొత్త అధ్యాయం




న్యూస్ డెస్క్, 01 జూన్ (తెలుగు గళం): తెలంగాణలోని పల్లెల్లో స్వపరిపాలన దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఒక చారిత్రాత్మక అడుగు వేయబోతోంది. గ్రామ పంచాయతీల సొంత ఆదాయంపై ఇప్పటివరకు ఉన్న ప్రభుత్వ నియంత్రణను పూర్తిగా తొలగించి.. ఆ నిధులను స్థానిక అవసరాలకే నేరుగా వాడుకునేలా పంచాయతీరాజ్ చట్ట సవరణకు కసరత్తు చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 12,760 గ్రామ పంచాయతీలకు ఇళ్లు, నల్లా పన్నులు, లేఅవుట్ అనుమతులు, సంతల నిర్వహణ, వేలం పాటల ద్వారా ఏటా సుమారు రూ.140 కోట్ల వరకు సొంత ఆదాయం సమకూరుతోంది. అయితే.. ప్రస్తుత నిబంధనల ప్రకారం ఈ నిధులన్నీ ప్రభుత్వ ట్రెజరీలో జమ అవుతుండటంతో రూపాయి ఖర్చు చేయాలన్నా ఆర్థిక శాఖ అనుమతి తప్పనిసరి అయింది.

ఈ పాత పద్ధతి వల్ల గ్రామాల్లో పారిశుధ్య కార్మికులకు వేతనాలు ఇవ్వాలన్నా, ట్రాక్టర్లకు డీజిల్ కొట్టించాలన్నా, వీధిలైట్లు, ఫినాయిల్, బ్లీచింగ్ పౌడర్ వంటి అత్యవసర వస్తువులు కొనాలన్నా నెలల తరబడి ట్రెజరీల చుట్టూ తిరగాల్సి వస్తోంది. కేంద్ర ఆర్థిక సంఘం నిధులు నేరుగా పంచాయతీల ఖాతాల్లో పడుతున్నప్పటికీ తాము కష్టపడి వసూలు చేసుకున్న సొంత నిధుల కోసం సర్పంచులు ఇబ్బందులు పడటంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమైంది. దీనిపై పంచాయతీరాజ్ కమిషనర్ దివ్యా దేవరాజన్ క్షేత్రస్థాయి నివేదికల ఆధారంగా ప్రభుత్వానికి లేఖ రాయగా.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించి చట్ట సవరణకు ఆదేశాలు జారీ చేశారు.

మిగతాది 2 లో..

# 24 రాజ్యసభ స్థానాలకు నోటిఫికేషన్ విడుదల

### 18న పోలింగ్



2 లో

# ఏపీసీసీ చీఫ్ షర్మిలకు రాజ్యసభ సీటు

### ప్రకటించిన అధిష్ఠానం


2 లో

## జనగణనలో భారీ సంఖ్యలు

### 4 కోట్లు దాటిన తెలంగాణ జనాభా?


2 లో

న్యూస్ డెస్క్, 01 జూన్ (తెలుగు గళం): రాష్ట్రంలో జనాభా నాలుగు కోట్లకు పైగానే ఉన్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం జనగణన హౌస్ లిస్టింగ్ సర్వే నడుస్తుండగా.. జూన్ ?9వ తేదీతో సర్వే పూర్తికానుంది. ఇప్పటివరకు రాష్ట్రంలో దాదాపుగా కోటి ఇళ్లల్లో జనగణన అధికారులు హౌస్‌లిస్టింగ్ సర్వే పూర్తిచేశారు. ఇందులో దాదాపుగా 3.86 కోట్ల జనాభా ఉందని లెక్కలు వేశారు. మరో 20 లక్షల ఇండ్లల్లో జనగణన సర్వే చేసి వివరాలు సేకరించాల్సి ఉందని అంచనా వేస్తున్నారు.

## ఖరీఫ్ రైతులకు వ్యవసాయశాఖ హెచ్చరిక


2 లో


న్యూస్ డెస్క్, 01 జూన్ (తెలుగు గళం): ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే రైతులను వ్యవసాయశాఖ అప్రమత్తం చేస్తోంది. ఎల్‌నినో ప్రభావంతో సంప్రదాయ పంటల కంటే పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవడమే ఉత్తమని సూచిస్తోంది. ఇప్పటికే రైతులు ఎలాంటి పంటల సాగు చేయాలనే అంశంపై యాక్షన్‌ప్లాన్‌సిద్ధం చేసింది. గతవారం రోజుల నుంచి మండల, గ్రామాలకు చెందిన వ్యవసాయ అధికారుల నుంచి సలహాలు, సూచనలు తీసుకుని రైతులకు మేలు చేసే పంటలు సాగు చేసేలా ప్రచారం చేయనుంది. ఉద్యాన శాఖ, వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో గ్రామాలకు వెళ్లి రైతులు తక్కువ కాలంలో చేతికొచ్చే పంటల సాగుతో పాటు నీటి లభ్యత ప్రకారం సాగు చేయాలనే అంశాలను వివరించనున్నారు. జూన్లో వర్షాలు ప్రారంభమవుతాయని భావించి తొందరపడి వరి సాగులోకి వెళ్లడం ప్రమాదకరమని, నీటి లభ్యతపై పూర్తి భరోసా ఉన్నప్పుడు మాత్రమే వరి వంటి నీటి ఆధారిత పంటలను సాగు చేయాలని సూచిస్తున్నారు.

మధ్యంతర కరువు

జూన్నెలలో సాధారణ వర్షపాత నమోదయ్యే అవకాశాలు ఉన్నప్పటికి రైతులు దాని ఆధారంగా అధిక నీటి అవసరమయ్యే పంటల వైపు మొగ్గు చూపకూడదని వ్యవసాయశాఖ హెచ్చరించింది. జూలై, ఆగస్టు నెలల్లో మధ్యంతర కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని ఈసమయంలో సాగునీటి నిర్వహణ అత్యంత కీలకమతుందని తెలిపింది. ఆగస్టు, సెప్టెంబర్లో కూడా నీటి సరఫరా కొనసాగుతుందనే నమక్మం ఉన్న ప్రాంతాల్లో మాత్రమే వరి సాగు చేయాలని, లేకుంటే ఇతర పంటలు ఎంచుకోవడం మంచిదని వ్యవసాయ రంగ నిపుణులు కూడా సూచిస్తున్నారు.

## రాష్ట్రంలో అభివృద్ధి పనుల జోరు

### ఉచిత తాగునీరు, యంగ్ ఇండియా స్కూళ్లకు నిధుల విడుదల



2 లో

న్యూస్ డెస్క్, 01 జూన్ (తెలుగు గళం): రాష్ట్రంలో ప్రజా మౌలిక సదుపాయాలు, సంక్షేమ కార్యక్రమాలను మరింత వేగవంతం చేస్తూ ఆర్థిక శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని పలు ప్రతిష్టాత్మక అభివృద్ధి పనులకు గాను భారీగా నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. హైదరాబాద్ నగర ప్రజలకు నిరంతరాయంగా తాగునీటిని అందించే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత తాగునీటి పథకానికి ఊరట లభించింది.

# రాష్ట్రంలో మరో రెండున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లు : సీఎం రేవంత్‌రెడ్డి

మొదటి పేజీ తరువాయి



తెలంగాణ సీఎం అంటే ఎందుకంత చిన్నచూపు

కాళేశ్వరంలో పెట్టిన రూ. లక్ష కోట్లు గోదావరిలో కలిసిపోయాయి. బీఆర్ఎస్ పాలనలో ఆదిలాబాద్‌లోని ప్రాజెక్టులను పట్టించుకోలేదు. తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు నిర్మించి ఆదిలాబాద్‌లోని 2 లక్షల ఎకరాలకు నీళ్లు ఇస్తాం. తుమ్మిడిహట్టి వద్ద ప్రాణహిత-చేవెళ్ల కోసం మహారాష్ట్ర సీఎంకు లేఖ రాశాను. అయినా అక్కడి నుంచి స్పందన లేదు. తెలంగాణ సీఎం అంటే మహారాష్ట్ర సీఎంకు ఎందుకుంత చిన్నచూపు? సమస్య పరిష్కరించడానికి కిషన్‌రెడ్డి చొరవ తీసుకోవాలి. పోలవరం ప్రాజెక్టు కోసం తెలంగాణలోని 7 గ్రామాలను ఏపీలో కలపలేదా? తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు వల్ల మహారాష్ట్రకు కలిగే నష్టాన్ని భరిస్తాం. మహారాష్ట్ర నుంచి 2వేల ఎకరాలు మాత్రమే అడుగుతున్నాం.

వడ్లు కొనకపోతే కేంద్రంపై యుద్ధమే

రాష్ట్రంలో ఇప్పటి వరకు 62లక్షల క్వింటాళ్ల వడ్లు కొనుగోలు చేశాం. మొత్తం 75లక్షల క్వింటాళ్ల వడ్లు కొంటాం. జూన్ 15 నాటికి ఈ కొనుగోళ్లు పూర్తవుతాయి. మేం సేకరించిన వడ్లు, మక్కలు, జొన్నలను కేంద్రం కొనాలి. దీనికి కిషన్‌రెడ్డి సహకారం అందించాలి. వడ్లు కొనకపోతే జూన్ 15 తర్వాత కేంద్రంపై యుద్ధం చేస్తాం"అని రేవంత్‌రెడ్డి హెచ్చరించారు.

# 24 రాజ్యసభ స్థానాలకు నోటిఫికేషన్ విడుదల.. 18న పోలింగ్



**న్యూస్ డెస్క్, 01 జూన్ (తెలుగు గళం):** దేశంలో 24 రాజ్యసభ స్థానాలను భర్తీ చేసేందుకు ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా సోమవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, గుజరాత్ రాష్ట్రాల్లో నాలుగేసి స్థానాలకు రాజ్యసభ ఎన్నికలు జరగనుండగా.. రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో మూడేసి స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. జార్ఖండ్లో రెండు రాజ్యసభ స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ఈ స్థానాలన్నింటినీ భర్తీ చేసేందుకు నామినేషన్లు కోరుతూ ఈసీ నోటిఫికేషన్ విడుదల చేసింది. జూన్ 8వ తేదీ వరకూ అభ్యర్థులు తమ నామినేషన్లు దాఖలు చేయాలని నోటిఫికేషన్లో పేర్కొంది. నామినేషన్ల స్క్రూటినీ జూన్ 9న చేపట్టనుంది. జూన్ 11వ తేదీ వరకూ అభ్యర్థులు తమ నామినేషన్లను విత్ డ్రా చేసుకునేందుకు గడువు ఇచ్చింది.

జూన్ 18న 24 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్.. అదేరోజు సాయంత్రం 5 గంటల నుంచి ఓట్లను లెక్కించి తుది ఫలితాలను వెల్లడించనుంది. జూన్ 20వ తేదీ నాటికి రాజ్యసభ ఎన్నికల ప్రక్రియ పూర్తికానుంది.

కాగా.. ఏపీలో పిల్లి సుభాష్ చంద్రబోస్, ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, పరిమళ్ నత్వానీ, సానా సతీష్ ల పదవీకాలం ఈ నెల 26వ తేదీనాటికి ముగియనుంది. దీంతో ఈ నాలుగు స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు ఈసీ నోటిఫికేషన్ ఇచ్చింది. వీరి స్థానాల్లో రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఎవరెవరిని నిలబెడుతుందన్న విషయంపై ఇంకా స్పష్టత రాలేదు.

# రాష్ట్రంలో అభివృద్ధి పనుల జోరు..

## ఉచిత తాగునీరు, యంగ్ ఇండియా స్కూళ్లకు నిధుల విడుదల



**న్యూస్ డెస్క్, 01 జూన్ (తెలుగు గళం):** రాష్ట్రంలో ప్రజా మౌలిక సదుపాయాలు, సంక్షేమ కార్యక్రమాలను మరింత వేగవంతం చేస్తూ ఆర్థిక శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని పలు ప్రతిష్టాత్మక అభివృద్ధి పనులకు గాను భారీగా నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. హైదరాబాద్ నగర ప్రజలకు నిరంతరాయంగా తాగునీటిని అందించే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత తాగునీటి పథకానికి ఊరట లభించింది. ఈ పథకానికి సంబంధించిన రీయింబర్స్‌మెంట్ కింద జలమండలికి రూ.75 కోట్ల నిధులను ఆర్థిక శాఖ విడుదల చేసింది. ఈ నిధులతో నీటి సరఫరా వ్యవస్థ మరింత మెరుగుపడటంతో పాటు, బకాయిల చెల్లింపులకు మార్గం సుగమం కానుంది.

రాష్ట్రంలో విద్యా ప్రమాణాలను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి భారీగా నిధులు మంజూరయ్యాయి. బీసీ సంక్షేమ శాఖ పరిధిలో నిర్మించ తలపెట్టిన ఈ పాఠశాలల భవన నిర్మాణ పనుల కోసం ఆర్థిక శాఖ రూ.414 కోట్లు కేటాయించింది. అన్ని వర్గాల విద్యార్థులకు ఒకేచోట అత్యుత్తమ వసతులతో కూడిన నాణ్యమైన విద్యను అందించేందుకు ఈ నిధులు ఎంతగానో ఉపయోగపడనున్నాయి.

# ఏపీసీసీ చీఫ్ షర్మిలకు రాజ్యసభ సీటు.. ప్రకటించిన అధిష్ఠానం

**న్యూస్ డెస్క్, 01 జూన్ (తెలుగు గళం):** ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు రాజ్యసభ సీటు కేటాయిస్తున్నట్లు కాంగ్రెస్ అధిష్ఠానం ప్రకటించింది. ఈ మేరకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రకటన చేశారు. కర్ణాటక నుంచి ఆమెను రాజ్యసభకు పంపుతున్నట్లు ఆయన వెల్లడించారు. షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరిన సమయంలోనే.. ఆమెకు రాజ్యసభ సీటు ఇస్తామని కాంగ్రెస్ అధిష్ఠానం హామీ ఇచ్చింది. ఆ హామీ మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. కర్ణాటకలో నాలుగు రాజ్యసభ స్థానాలు ఖాళీగా ఉండగా.. వాటిలో ఒకటి షర్మిలకు కేటాయించింది పార్టీ అధిష్ఠానం. ప్రస్తుతం అక్కడ కాంగ్రెస్ పార్టీనే అధికారంలో ఉండటంతో.. షర్మిల గెలుపు ఈజీ కానుందన్న సంకేతాలు వెలువడుతున్నాయి.

ఏపీసీసీ అధ్యక్షురాలిగా ఉన్న షర్మిలకు రాజ్యసభ అవకాశం కల్పించడం ద్వారా సౌతిండియా పాలిటిక్స్ లో కాంగ్రెస్ ను మరింత బలపడేలా చేయాలని కాంగ్రెస్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్.. ఏపీలోనూ పునర్వైభవాన్ని పొందాలని చూస్తోంది. రెండ్రోజుల క్రితమే షర్మిల కాంగ్రెస్ అగ్రనేత అయిన రాహుల్ గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తో భేటీ అవ్వగా.. రాజ్యసభకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారని వార్తలొచ్చిన విషయం తెలిసిందే.

# బీజేపీలో ముదురుతోన్న అంతర్గత పోరు.. కమలదళం చీలిందా?

మొదటి పేజీ తరువాయి

నిజామాబాద్ఎంపీ అర్వింద్, ఈటల కొంతకాలంగా సాన్నిహిత్యంగా ఉంటున్నారని.. దీంతో వారిని లక్ష్యంగా చేసుకొని వారిమధ్య గ్యాప్ వచ్చేలా పోస్టర్‌ను ముద్రించారని ఈటల అనుచరులు ఆరోపిస్తున్నారు. అయితే, బండి సంజయ్ కొడుకు భగీరథ్ మీద పోక్సో కేసు కావడంతో కేంద్రమంత్రి, ఈటల, అర్వింద్ మధ్య వివాదం మరింత ముదరిందని పార్టీ నాయకులు చెబుతున్నారు. బండి రాష్ట్ర అధ్యక్షుడిగా దిగిపోవడానికి పరోక్షంగా ఈటల, ఇతర నేతలు కారణమంటూ బండి అనుచరులు ఆరోపిస్తున్నారు. సంజయ్ కొడుకు వివాదం బయటకు రావడంలో ఈటల, అర్వింద్ హస్తముందంటూ ఆరోపణలు వచ్చాయి. దీంతో ఈ ముగ్గురు నేతల మీద బహిరంగంగానే సోషల్?మీడియాలో పరస్పర పోస్టులు, విమర్శలు వైరల్ అవుతున్నాయి.

పోస్టర్‌లో ఏముంది?

'ఈటల ఏడుపే బీజేపీకి శాపం..! రాష్ట్ర అధ్యక్ష పదవి రాలేదని ఏడుపు, సీఎం అభ్యర్థిగా ప్రకటించలేదని ఏడుపు... కేంద్రమంత్రి పదవి రాలేదని ఏడుపు. రెండు చోట్ల ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం ఇచ్చింది బీజేపీ. ఓడిపోయినా మల్కాజిగిరి ఎంపీ టికెట్ ఇచ్చింది బీజేపీ. మోడీ నాయకత్వంలో గెలిచినా.. నా ఇమేజ్‌తోనే గెలిచాను అనడం ఇదేం రాజకీయ నైతికత. బీసీ నాయకులు ఎదుగుతుంటే అసహనం ఎందుకు? ఇందూరు బిడ్డ ఎంపీ అర్వింద్‌కు వస్తున్న ఆదరణ చూసి కడుపుమంట ఎందుకు? నేనే బీసీ నాయకుడిని.. నేనే ప్రత్యామ్నాయం.. అనే భ్రమ నుంచి బయటకు రా ఈటల. బీజేపీ నీకు ఎన్నో అవకాశాలు ఇచ్చింది' అంటూ ఆ పోస్టర్‌లో రాసుకొచ్చారు.

కేంద్రమంత్రి పదవిపై ఆశలు..

బండిని కేంద్ర మంత్రివర్గంలోకి తీసుకునే క్రమంలో తమకు పదవి వస్తుందని ఎంపీలు ఈటల, అర్వింద్, డీకే అరుణ తదితరులు భావించారు. తీరా బండికి చాన్స్ దక్కడంతో వారంతా నిరాశ చెందారు. రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం వారంతా ఎదురుచూశారు. కానీ, సాధ్యం కాలేదు. త్వరలో కేంద్ర మంత్రివర్గ విస్తరణ ఉంటుందని టాక్. రాజ్యసభ ఎన్నికల అనంతరం ఈనెలాఖరున లేదా వచ్చేనెల మొదటి వారంలో విస్తరణ ఉండే అవకాశం ఉంది. రాష్ట్రంలో మరొకరికి కేంద్రమంత్రి పదవి వచ్చే చాన్స్ ఉంటుందని ప్రచారం జరుగుతోంది. దీంతో ఎంపీలు ఎవరికి వారు ప్రయత్నాలు చేస్తున్నారు. మహిళా కోటాలో డీకే అరుణ, ఎస్టీ కోటాలో నగేశ్, బీసీ కోటాలో లక్ష్మణ్, ఈటల, అర్వింద్‌లు ఉన్నారు. ఈ క్రమంలోనే గ్రూపు రాజకీయాలు, ఆధిపత్య పోరు పెరిగిందని పార్టీలో చర్చ జరుగుతోంది.

బీజేఎల్పీ నేతల ఖండన

ఈటలకు వ్యతిరేకంగా పోస్టర్లు వెలిసిన నేపథ్యంలో బీజేఎల్పీనేత మహేశ్వర్?రెడ్డితో పాటుగా మిగతా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రకటన విడుదల చేశారు. పోస్టర్ల వివాదాన్ని ఖండించారు. ఎంపీ ఈటలను కించపరిచేలా ఏర్పాటు చేసిన బ్యానర్లను రాష్ట్ర బీజేపీ నేతలు, కార్యకర్తలు ముక్తకంఠంతో ఖండిస్తున్నట్టు పేర్కొన్నారు. ఇది ఒక నాయకుడిపై వ్యక్తిగత దాడి మాత్రమే కాదని, తెలంగాణ బీజేపీ ఎదుగుదలను చూసి భయపడుతున్న ప్రత్యర్థి రాజకీయ శక్తుల అసురక్షిత భావానికి నిదర్శనమని వివరించారు. ఈటల దాదాపు 40 ఏళ్ల రాజకీయ అనుభవం కలిగిన సీనియర్ నాయకుడని, ప్రజా జీవితంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న వ్యక్తిని కించపరిచేలా నీచ రాజకీయాలు చేయడం సరికాదన్నారు. ఈ విషయంలో రాష్ట్ర బీజేపీ నాయకులు ఐక్యం ఉండి కుట్రలను తిప్పికొడతామని పేర్కొన్నారు.

# ఎల్‌నినో ఎఫెక్ట్.. ఖరీఫ్ రైతులకు వ్యవసాయశాఖ హెచ్చరిక

మొదటి పేజీ తరువాయి

ఈ ఖరీఫ్సీజన్ప్రభుత్వం 131 లక్షల ఎకరాలో వివిధ పంటలు సాగు అవుతాయని అంచనావేసి అందులో వరి 65 లక్షలు సాగు అవుతుందని గుర్తించింది. ఎల్‌నినో కారణంగా వరిసాగు 35 లక్షల ఎకరాలు దాటకుండా ప్రయత్నాలు చేస్తోంది.



అధిక ఆదాయం

రైతులు కూరగాయలు, పండ్లు, నువ్వులు, పొద్దు తిరుగుడు, కుసుమలు, శనగలు పంటలు వేస్తే అధిక ఆదాయం వస్తోందని ఉద్యాన శాఖ పేర్కొంటుంది. ఈఏడాది నుంచి మార్కెట్సౌకర్యాలు మెరుగుపరుస్తుండగా పంటను చేనులో నుంచి నేరుగా మార్కెట్ కు తీసుకొచ్చి అమ్ముకునేలా ఏర్పాట్లు చేస్తోంది. రైతులు కూరగాయలు, పండ్లు మార్కెట్కు తీసుకొచ్చినప్పుడే ధరలు పడిపోతాయి. అదే దళారులు కొనుగోలు చేసిన సరుకులు రెండింతలు ధరలు పెరుగుతాయి. ఈసారి అలాంటి పరిస్థితులు రాకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఈ వానాకాలంలో వ్యవసాయశాఖ వేరుశనగ 26 వేల ఎకరాలు, నువ్వులు 650 ఎకరాలు, పొద్దు తిరుగుడు 150 ఎకరాలు, కుసుమలు 3,600 ఎకరాల్లో సాగు కావచ్చని అంచనా వేస్తోంది. జొన్నలు 39 వేల ఎకరాలు, సజ్జలు 1200 ఎకరాల్లోనే సాగు అయ్యే అవకాశం ఉందని భావిస్తోంది. మొక్కజొన్నలు 5.40 లక్షల ఎకరాలు, కంది పంట 5.10 లక్షల ఎకరాల్లో వేయాలని టార్గెట్ పెట్టుకుంది. మిర్చి 1.90 లక్షల ఎకరాలు, సోయాబీన్4.10 లక్షల ఎకరాలు, పెసర్లు 65 వేల ఎకరాలు, మినుములు 28 ఎకరాలు రైతులు సాగు చేసేలా ప్రయత్నాలు చేస్తోంది.


సన్న వరిసాగు

ఈసారి వానలు తక్కువగా కురిసే పరిస్థితి ఉండటంతో సన్న వరి కంటే దొడ్డు రకాలు వేయాలని రైతులకు వ్యవసాయ శాఖ సూచించనుంది. సన్నాలు వేస్తే అధిక నీటి వినియోగంతో పాటు పంట కాలం ఎక్కువగా ఉంటుంది. దీంతో సమయానికి నీరు లభించకుంటే పంట ఎండిపోవడంతో పాటు పెట్టుబడి రైతులు నష్టపోతారు. దొడ్డు వరి సాగు చేస్తే తక్కువ కాలంలో పంట చేతికి రావడంతో పాటు నీటి సమస్య ఉన్న అధిగమించవచ్చు. ఒక వేళ పంట ఎండిన పెద్దగా నష్టం కూడా ఉండదు. ఎరువుల వినియోగం సన్నాల కంటే తక్కువ ఉంటుంది.

# గ్రామాలకు స్వేచ్ఛ..సొంత నిధుల వినియోగం

మొదటి పేజీ తరువాయి

ఈ ఆర్థిక స్వేచ్ఛను అమలు చేయడానికి తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం-2018 లోని సెక్షన్ 70(3)ని సవరించాల్సి ఉంటుంది.




దీంతోపాటు నిధుల డ్రా ప్రక్రియలో పారదర్శకత కోసం జాయింట్ చెక్ పవర్ విధానంలో కీలక మార్పు చేయనున్నారు. ప్రస్తుతం ఉన్న సర్పంచ్, ఉపసర్పంచ్ ఉమ్మడి చెక్ పవర్ స్థానంలో.. ఉపసర్పంచ్‌ను తొలగించి గ్రామ కార్యదర్శికి ఆ బాధ్యతలు అప్పగించనున్నారు. ఈ మేరకు రూపొందించిన రెండు ఆర్డినెన్స్‌లను త్వరలో జరగబోయే మంత్రిమండలి సమావేశంలో ప్రవేశపెట్టి ఆమోదం తెలపనున్నారు. ఈ ఆర్డినెన్స్ అమలులోకి వస్తే.. పంచాయతీల సొంత ఆదాయం నేరుగా స్థానిక బ్యాంకు ఖాతాల్లోనే నిల్వ ఉంటుంది.

అయితే.. నిధుల వినియోగంలో దుర్వినియోగం, అవినీతి జరగకుండా ప్రభుత్వం అత్యంత కఠినమైన నిబంధనలను విధిస్తోంది. పంచాయతీకి వచ్చే ప్రతి రూపాయి ఆదాయం, చేసే ప్రతి ఖర్చు వివరాలను విధిగా రాష్ట్ర ప్రభుత్వ అధికారిక ఈ-పంచాయత్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ చేయాల్సి ఉంటుంది. అలాగే పారదర్శకత కోసం ఆ వివరాలను గ్రామ పంచాయతీ కార్యాలయ బోర్డుపై ప్రజలకు కనిపించేలా ప్రదర్శించాలి. వీటికి తోడు ప్రతి ఏటా తప్పనిసరిగా స్టేట్ ఆడిట్ విభాగంతో ఆడిటింగ్ నిర్వహించాలి. ఒకవేళ నిధుల వినియోగంలో ఎలాంటి అవకతవకలు లేదా నిబంధనల ఉల్లంఘనలు జరిగినా సర్పంచ్, గ్రామ కార్యదర్శిలను సంయుక్తంగా బాధ్యులను చేస్తూ వారిపై కఠిన క్రిమినల్, శాఖాపరమైన చర్యలు తీసుకునేలా చట్టంలో నిబంధనలు పొందుపరుస్తున్నారు.

# జనగణనలో భారీ సంఖ్యలు.. 4 కోట్లు దాటిన తెలంగాణ జనాభా?

మొదటి పేజీ తరువాయి

నాలుగు వారాల సర్వేలో భాగంగా వారానికి దాదాపుగా 30 లక్షల ఇళ్ల చొప్పున యజమానుల వివరాలు సేకరిస్తున్నారు. మొదట్లో మ్యాపింగ్, ఆ ప్రాంతంపై అవగాహన, యాప్‌లో సాంకేతిక సమస్యల కారణంగా మొదటి మూడు, నాలుగు రోజులు సర్వే కొద్దిగా నెమ్మదిగా సాగింది. ఆ తర్వాత వేగం పుంజుకుంది. జూన్ 9తో సర్వేను పూర్తి చేయాల్సి ఉంది.

జనగణన, ఓటరు మ్యాపింగ్ ఒకేసారి..

గ్రామీణ ప్రాంతాల్లో హౌస్‌లిస్టింగ్ సర్వేలో ఎలాంటి సమస్య లేకపోయినా పట్టణ ప్రాంతాల్లోనే సమస్యలు వస్తున్నాయని అధికారులు గుర్తించారు. ప్రస్తుతం వేసవి సెలవులు ఉన్నందున అనేక మంది తీర్థయాత్రలు, విహారయాత్రలు, వ్యక్తి గత పనులు, గ్రామీణ ప్రాంతాలకు వెళ్లినట్టు గుర్తించారు. అనేక ఇళ్లకు తాళాలు వేసి ఉన్నందున ఇబ్బందులు వస్తున్నాయని సిబ్బంది చెబుతున్నారు. ఒకే ఇంటికి రెండు, మూడు సార్లు వెళ్లాల్సి వస్తుందని, ఇంట్లో ఎవరూ ఉండటంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్‌లో అంచనా వేసిన దాని కంటే ఎక్కువ సంఖ్యలోనే ఇళ్లు ఉన్నాయని.. కొత్త కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలు పెద్ద ఎత్తున రావడంతో సిబ్బందిపై అదనపు భారం పడుతోందని అధికారులు పేర్కొన్నారు. మరోవైపు రాష్ట్రంలో వేసవి ఎండలు తీవ్రంగా ఉన్నాయి. ఎండలకు ప్రజలు అల్లాడుతున్నారు. అనేక మంది వడదెబ్బతో చనిపోతున్నారు. సర్వే చేసే సిబ్బంది సైతం ఎండలో తిరగలేక ఉదయం, సాయంత్రం వేళల్లో తమ పనిని ముగించుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. పట్టణాల్లో విద్యావంతులు ఉన్నా సిబ్బందికి సరిగా సహకరించడంలేదని ఫిర్యాదులు అందుతున్నాయి. సహాయనిరాకరణ చేయడం, అనేక యక్ష ప్రశ్నలు వేసి సిబ్బందిని విసిగిస్తున్నట్టు తెలిసింది. ఇదే సమయంలో ఓటరు జాబితా ప్రక్షాళన మ్యాపింగ్?సైతం చేస్తున్నారు. కొన్నిచోట్ల జనగణన, మరోవైపు ఓటరు మ్యాపింగ్ ఒకేసారి జరుగుతుండటంతో ఎవరు ఏ అధికారి అని తెలియక ప్రజలు అయోమయానికి గురవుతున్నట్టు సమాచారం. ఓటరు మ్యాపింగ్ అధికారులు వారికి సంబంధించిన వ్యక్తుల వివరాలు, ధ్రువపత్రాలు కూడా అడుగుతుండటంతో కొంత గందరగోళానికి గురవుతున్నారు. పూర్తి అవగాహన లేకపోవడంతో వల్ల కొంత ఆందోళనకు కూడా గురైనట్టు సమాచారం.

సర్వేల్లో తేడాలు..: గతంలో రాష్ట్ర ప్రభుత్వం బీసీ గణన చేసినప్పుడు 1.15 కోట్ల కుటుంబాలను గుర్తించారు. నాడు మొత్తం జనాభా 3.50 కోట్లుగా తేలింది. కానీ, కొందరు సర్వేలో పాల్గొనలేదు. ప్రస్తుత జనగణనలో మాత్రం అంత కంటే తక్కువ సంఖ్యలోనే ఇళ్లు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. బీసీ గణనలో ప్రభుత్వ పథకాల కోసం కలిసి ఉన్న కుటుంబాలు సైతం విడివిడిగా వివరాలు నమోదు చేసుకున్నాయి. జనగణనకు వచ్చే సరికి మాత్రం అందరూ తక్కువ కుటుంబాలను చూపుతున్నట్టు తెలుస్తోంది. దీంతో కుటుంబాల సంఖ్య తక్కువగా, జనాభా సంఖ్య ఎక్కువగా ఉంటోందని క్షేత్రస్థాయి జనగణన అధికారులు చెబుతున్నారు. 1.15 కోట్లకు కొంచెం అటు ఇటుగా కుటుంబాలు ఉంటాయని, జనాభా మాత్రం ఎక్కువగా ఉండే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే దాదాపుగా కోటి వరకు ఇళ్ల సర్వే పూర్తయిందని, హైదరాబాద్ మహానగరంలో మాత్రం ఇళ్ల సంఖ్య పెరిగే చాన్స్ ఉందని, గేటెడ్ కమ్యూనిటీలోనూ కొందరు బీసీ గణనకు సహకరించలేదని.. కానీ, ప్రస్తుతం జనగణనకు ప్రజలంతా సహకరిస్తున్నందున ఎక్కువ సంఖ్యలో ఇళ్లు నమోదయ్యే అవకాశం ఉందని విశ్లేషిస్తున్నారు.

# సైదాదుపల్లిలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ లో పాల్గొన్నా - చెన్ను అశోక్ రెడ్డి



**నెల్లూరు జిల్లా రాపూరు (తెలుగు గళం):**-నెల్లూరు జిల్లా రాపూరు మండలం సైదాదుపల్లి గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి రాపూరు మండల అధ్యక్షులు చెన్ను అశోక్ రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి లబ్ధిదారుల ఇంటింటికి తిరిగి స్వయంగా పింఛన్లు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో చెన్ను అశోక్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.

విజన్ ఉన్న నాయకుడు ముఖ్యమంత్రి అయితే రాష్ట్ర భవిష్యత్తు ఎలా మారుతుందో చెప్పడానికి చంద్రబాబు నాయుడు నిదర్శనం.

సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని మళ్లీ ప్రగతి పథంలోకి తెచ్చేందుకు ఆయన అహర్నిశలు శ్రమిస్తున్నారు.

రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావాలన్నా, అమరావతిని ప్రపంచస్థాయి రాజధానిగా నిర్మించాలన్నా. పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి ప్రతి ఎకరాకూ నీరివ్వాలన్నా. అది కేవలం అనుభవజ్ఞుడైన నాయకుడు నారా చంద్రబాబు నాయుడు వల్లనే సాధ్యమవుతుంది. ఆయన చేతులు బలోపేతం అయితేనే మన పిల్లల భవిష్యత్తు,మన రాష్ట్ర భవిష్యత్తు సురక్షితంగా ఉంటుంది.

రాబోయే రోజుల్లో కూటమి ప్రభుత్వాన్ని మరింత బలోపేతం చేయాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది.కులమతాలకు,రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఈ అభివృద్ధి యజ్ఞంలో భాగస్వాములు కావాలి.సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్దాం. చంద్రబాబు నాయుడు నాయకత్వాన్ని, కూటమి ప్రభుత్వాన్ని మరింత బలపరుద్దాం నవ్యాంధ్రప్రదేశ్‌ను అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దుకుందాం అని తెలిపారు.

ఈ కార్యక్రమంలో నల్లవడ్ల వెంకట రమణా రెడ్డి, బత్తిన శ్రీహరి రెడ్డి, చిలకం ప్రసాద్ రెడ్డి,, చంద్రమౌళి, మోహన్, కూకటి పెంచలయ్య యాదవ్, గొర్ల వెంకటేశ్వర్లు యాదవ్, పల్లమాల మల్లేశ్వర్ యాదవ్, సమయం రమణ ప్రసాద్, తదితర నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌ను కలిసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

దిల్లీ: దిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క.. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల ఝార్ఖండ్‌లో పర్యటించిన భట్టి విక్రమార్క.. అక్కడి సీఎం హేమంత్ సోరెన్, స్థానిక కాంగ్రెస్ నాయకులతో చర్చలు జరిపారు. పార్టీ వ్యవహారాలకు సంబంధించి ఓ నివేదికను రూపొందించారు. ఆ నివేదికను తాజాగా కేసీ వేణుగోపాల్‌కు అందజేశారు.



# చరిత్రలోనే మొట్టమొదటిసారిగా లేబర్ ఆఫీసులో చాలీచాలని భవన నిర్మాణ కార్మికుల రేట్ల పెంపకం బాధాకరం గుగులోతు పటేల్





తెలుగు గళం న్యూస్, ఖమ్మం పట్టణం / జూన్ 02, ఖమ్మం జిల్లా : ఈరోజు ఖమ్మం జిల్లా కేంద్రంలోని ఐఎఫ్టియు జిల్లా కార్యాలయంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం తీగల లాజర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోతు పటేల్ పాల్గొని మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల ఐక్యమత్యం లోపం వల్ల మొట్టమొదటిసారిగా లేబర్ ఆఫీసులో ఉడత బత్యంగా రేట్ల పెంపకం అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు లేబర్ ఆఫీసులో జరిగే అవకతవకలను అరికట్టాలని రాడ్ బెండింగ్ కార్మికులు ఎత్తుకుపోయేత్తు 5 6 7 బిల్డింగ్ అంతస్తులపై ప్రాణాలను అరిచేతిలో పెట్టుకుని ఎత్తు పీటలపై ఎలాంటి రక్షణ కిట్టు లేకుండా పనిచేస్తున్నారు ఇలా పని చేస్తూ పైనుంచి జారిపడి ఎందరో కార్మికులు ప్రాణాలు కోల్పోయారు కనుక సంక్షేమ బోర్డు నుంచి కార్మికులకు రక్షణ కిట్టు ఇప్పించాలని ప్రభుత్వాన్ని కోరారు అలాగే యాజమాన్య వర్గాన్ని అసోసియేషన్ లో నమోదయి ఉన్న మేస్త్రులకు మాత్రమే పని ఇచ్చి ఇంటి నిర్మాణం చేయించుకోవాలని బాధ్యత లేని వారికి ఇచ్చి నిర్మాణ లోపాన్నికి గురి కాకూడదని యజమాని వర్గాన్ని కోరారు నిర్మాణ రంగా కార్మికులు ఐక్యత గా లేకపోవడం వలన ఇలాంటి సమస్యలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు నిర్మాణ రంగ కార్మికులు లేబర్ బోర్డులో నూటికి 60 శాతం మాత్రమే నమోదయి ఉన్నామని మిగతా 40 శాతం కూడా నమోదు చేసుకోవాలని కార్మిక లోకానికి పిలుపునిచ్చారు అలాగే రెన్యువల్ అయిపోయిన కార్డులను 90 రోజులు లోపే చేయించుకుంటే రెన్యువల్ అవుతున్నాయి అంతకుమించితే కావట్లేదు కనుక నిజమైన కార్మికుడికి షరతులు లేకుండా ఎప్పుడైనా రిన్వల్ చేయించుకునేలా ఏర్పాటు చేయాలని అలాగే కేంద్ర ప్రభుత్వం 44 చట్టాలను 29 చట్టాలకు కుదించి అందులో నుంచి నాలుగు లేబర్ కోడ్లను తీసుకురాబోతుంది ఈ నాలుగు లేబర్ కోడ్లవల్ల కార్మికులు తీవ్ర నష్టాన్ని ఎదుర్కోవాల్సి వస్తుంది కనుక ఆ నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియు జిల్లా నాయకులు ఉబ్బని దాసు యల్ సైదారావు కాంపాటి పుల్లయ్య నారపాక అవినాష్ నారపాక ఉపేందర్ కోట రాజు షేక్ బాషా నవీన్ అనిల్ రమేష్ శాంతయ్య భద్రయ్య రాము వెంకన్న భాస్కర్ సీతయ్య కాంతయ్య మోహన్ రావు వెంకటేశ్వర్లు సతీష్ నరసింహారావు గురవయ్య వీరబాబు తదితరులు పాల్గొన్నారు

# ప్రజా సమస్యలు పరిష్కారం ద్వారా అధిక స్థానాల్లో గెలవాలి - బివి రాఘవులు






- ఖమ్మం సిపిఎం పార్టీ డివిజన్ వర్క్ షాప్ ముఖ్య అతిథిగా హాజరైన పార్టీ పోలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు

తెలుగు గళం న్యూస్, ఖమ్మం పట్టణం / జూన్ 02, ఖమ్మం జిల్లా : గతంలో ఖమ్మం నగరంలో సమర్థవంతమైన పాలన అందించిన ఘనత సిపిఎం పార్టీకి వుంది అని, ప్రజలకు మరింత చేరువగా వుండటం ద్వారా వచ్చే కార్పొరేషన్ ఎన్నికల్లో అధిక స్థానాల్లో పార్టీ గెలవడానికి చాలా అవకాశాలు ఉన్నాయి అని సిపిఎం పార్టీ పోలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు తెలిపారు. సోమవారం సుందరయ్య భవనంలో జరిగిన పార్టీ ఖమ్మం డివిజన్ వర్క్ షాప్ జిల్లా కమిటీ సభ్యులు భుక్యా శ్రీనువాసురావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పోలిట్ బ్యూరో నుంచి బివి రాఘవులు హాజరు అయి క్యాడర్ కు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ ఛైర్మన్ గా చిర్రావూరి లక్ష్మి నర్సయ్య, ఆతర్వాత కాలంలో మరోసారి మున్సిపల్ ఛైర్మన్ గా సమీనా అఫ్రోజ్ చిత్తశుద్ధితో నిజాయితీగా, అత్యంత సమర్థవంతంగా పరిపాలన చేశారు అని తెలిపారు. భవిష్యత్ ఖమ్మం నగర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఆనాడే త్రాగు నీరు సౌకర్యం, విశాలంగా రహదారులు, తదితర మౌలిక సదుపాయాలు ఆ కాలంలోనే ప్రజల అవసరాలకు తగ్గట్టుగా కల్పించారు అని తెలిపారు. ఈరోజు ఖమ్మం నగరంలో ఏ సమస్యలు వచ్చినా ప్రజల వైపు నిలబడి నిత్యం ఆందోళనలు చేయడం ద్వారా మరింతగా ప్రజలకు సౌకర్యాలు ఏర్పాటు చేయడానికి సిపిఎం పార్టీ ఒక కారణం అని తెలిపారు. ప్రజలతో మరింతా మమేకమై ప్రజా సమస్యలు పరిష్కారం రాబోయే ఎన్నికల్లో ద్వారా అధిక స్థానాల్లో కార్పొరేటర్లు గెలవడానికి తగిన ప్రణాళిక చేసుకోవాలి అని సూచించారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం పూర్తిగా ప్రజా సమస్యలు గాలికి వదిలేసి దేశ సంపద అంతా అదానీ, అంబానీ లకు ధారాదత్తం చేసే పనిలో మోడీ బిజీగా ఉన్నారు అని విమర్శించారు. రోజూ పెట్రోల్ డీజిల్ ధరలు పెంచడం వల్ల ప్రజలపై తీవ్ర ఆర్థిక భారాలు పడుతున్నాయి అని ఆరోపించారు. రాబోయే కాలంలో మోడీ వ్యతిరేకంగా ప్రజా ఆందోళనలు విస్తృతంగా చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలు వెంటనే అమలు పరచాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు, యర్రా శ్రీనువాసురావు, నాయకులు బండారు రమేష్, దొంగల తిరుపతిరావు, జబ్బర్, ఎస్ నవీన్ రెడ్డి, మీరా సాహిబ్, పి రమ్య, బోడపట్ల సుదర్శన్, నాగులు మీరా, ఉపేంద్రర్, మాజీ కార్పొరేటర్లు యర్రా గోపి, ఎల్లంపల్లి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు

# నేడు తెలంగాణ అవతరణ దినోత్సవం : గ్రామ గ్రామాన జెండా ఆవిష్కరణ

## ఉదయం 8 గంటలకు ప్రతి గ్రామంలో జాతీయ, గులాబీ జెండాలు ఎగురవేయాలి

## తెలంగాణ గర్వం ప్రతి ఇంటా వెల్లివిరియాలి: ఎర్రబెల్లి రాజేశ్వర్ రావు

తెలుగు గళం న్యూస్ పర్వతగిరి /జూన్ 1



పర్వతగిరి, తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని (జూన్ 2న) పర్వతగిరి మండలంలోని అన్ని గ్రామాల్లో ఉదయం 8 గంటల లోపు జాతీయ జెండాతో పాటు బీఆర్ఎస్ పార్టీ గులాబీ జెండాను ఆవిష్కరించాలని మాజీ మండల అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వర్ రావు పిలుపునిచ్చారు. పర్వతగిరి మండల అభివృద్ధి ప్రదాత, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, వర్ధన్నపేట బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరుగుతాయని ఆయన తెలిపారు."తెలంగాణ ఆవిర్భావంతో గ్రామ గ్రామాన గులాబీ జెండా రెపరెపలాడాలి. తెలంగాణ గర్వం ప్రతి ఇంటా వెల్లివిరియాలి" అని అన్నారు.

అనంతరం ఉదయం 9 గంటలకు పర్వతగిరి మండల కేంద్రంలోని అంబేద్కర్ సర్కిల్‌లో మండల పార్టీ ఆధ్వర్యంలో జాతీయ జెండా మరియు పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వివరించారు.ఈ కార్యక్రమానికి ప్రస్తుత, మాజీ ప్రజాప్రతినిధులు, మండల సీనియర్ నాయకులు, మండల కమిటీ సభ్యులు, గ్రామ శాఖ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, మైనారిటీ నాయకులు,వివిధ గ్రామ నాయకులు,కార్యకర్తలు, యూత్ నాయకులు,సోషల్ మీడియా నాయకులు అందరూ సకాలంలో హాజరై ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎర్రబెల్లి రాజేశ్వర్ రావు కోరారు.

# జొన్నల కొనుగోలు పెంచాలని రైతుల ధర్నా



తెలుగు గళం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా జూన్ 1: కామారెడ్డి జిల్లా పిట్లం మండల కేంద్రంలో సోమవారం నాడు జొన్నల కొనుగోలు పరిమితిని పెంచాలని డిమాండ్ చేస్తూ రైతులు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమం బీజేపీ జుక్కల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే అరుణతార ఆధ్వర్యంలో జరిగింది. ఎకరానికి సగటున 20 క్వింటాళ్ల వరకు జొన్న దిగుబడి వస్తుండగా, ప్రభుత్వం ఎకరానికి కేవలం 10 క్వింటాళ్ల మాత్రమే కొనుగోలు చేయడం వల్ల రైతులు తీవ్ర అయోమయానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మిగిలిన జొన్నలను ఏమి చేయాలో తెలియని పరిస్థితి నెలకొందని పేర్కొంటూ, ఎకరానికి 20 క్వింటాళ్ల వరకు జొన్నలను కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు వివిధ రాజకీయ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం.. రాష్ట్ర పోలీసులకు పతకాలు




హైదరాబాద్,తెలుగు గళం: ఉత్తమ సేవలు అందించిన పలువురు పోలీసులు, అధికారులకు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం పతకాలు ప్రకటించింది. టీఎస్ జెన్‌కో విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ చీఫ్ ప్రతాప్‌కు సీఎం సర్వోన్నత పోలీసు పతకం దక్కింది. భద్రాద్రి కొత్తగూడెం రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ రవి, చెర్ల సీఐ రాజుకు శౌర్య పతకం ప్రకటించారు. ఇంటిలిజెన్స్ కానిస్టేబుల్ సంపత్, గ్రేహౌండ్స్‌లోని మరో ఏడుగురికి శౌర్య పతకాలు వరించాయి. 16 మందికి మహోన్నత సేవా పతకాలు, 94 మందికి ఉత్తమ సేవా పతకాలు, 50 మంది కఠిన సేవా పతకాలు, మరో 461 మంది సేవా పతకాలు అందుకోనున్నారు.

# నూతన మున్సిపల్ కమిషనర్ గా కంచర్ల నరేష్ రెడ్డి

తెలుగు గళం న్యూస్ మహబూబాబాద్ జిల్లా:



మహబూబాద్ జిల్లా మరిపెడ మున్సిపల్ కమిషనర్ గా కంచర్ల నరేష్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన కమిషనర్ రామడుగు విజయనంద్, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ గా పదోన్నతపై వెళుతుండగా, భువనగిరి మున్సిపల్ లో మేనేజర్ గా విధులు నిర్వహిస్తున్న కే నరేష్ రెడ్డి, మరిపెడ కమిషనర్ గా వచ్చారు. కాగా మున్సిపల్ చైర్మన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి ఆధ్వర్యంలో విజయనంద్ కు వీడ్కోలు పలికి, సన్మానించారు, ఈసందర్భంగా వారికి కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా కమిషనర్ గా బాధ్యతలను స్వీకరించిన నరేష్ రెడ్డి కి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారిని శాలువాలతో సత్కరించి ఘనంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది వార్డు కౌన్సిలర్లు తదితరులు ఉన్నారు.

# భవాని నగర్ కాలనీలో నిలిచిపోయిన పనులు

## వెంటనే పూర్తి చేయాలని కాలనీ వాసుల డిమాండ్



తెలుగు గళం,హైదరాబాద్: సుభాష్ నగర్ డివిజన్, కొంపల్లి సర్కిల్ పరిధిలోని తారా ఫంక్షన్ హాల్ సమీపంలో గల భవాని నగర్ కాలనీలో నెలల తరబడి నిలిచిపోయిన యూజీడీ , సీసీ రోడ్ల పనుల వల్ల స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికీ పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో మురుగునీరు రోడ్లపైకి చేరుతోందని, రోడ్లు దెబ్బతిని రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతోందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో నీటి నిల్వలు పెరిగి, దోమల వ్యాప్తి, దుర్వాసనతో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. కాలనీవాసులు క్రమం తప్పకుండా ఇంటి పన్నులు, మున్సిపల్ పన్నులు చెల్లిస్తున్నప్పటికీ, ప్రాథమిక మౌలిక సదుపాయాలు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించడం విచారకరమన్నారు. దీనివల్ల వృద్ధులు, మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు ప్రతిరోజూ నరకయాతన అనుభవిస్తున్నారని మండిపడ్డారు. ఈ సమస్యపై ఇప్పటికే పలుమార్లు సంబంధిత అధికారులకు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ ఎలాంటి స్పష్టమైన చర్యలు తీసుకోలేదని కాలనీ అసోసియేషన్ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు ఎందుకు నిలిచిపోయాయో ప్రజలకు వివరించాలని, మంజూరైన అభివృద్ధి పనులను ఎటువంటి రాజకీయ లేదా పరిపాలనా కారణాలతో ఆలస్యం చేయకుండా వెంటనే పునఃప్రారంభించాలని వారు డిమాండ్ చేశారు. ప్రజల సంక్షేమం కంటే రాజకీయాలు ముఖ్యం కాదని, తక్షణమే అధికారులు స్పందించి నిలిచిపోయిన యూజీడీ పనులను, సీసీ రోడ్ల నిర్మాణాన్ని అత్యవసరంగా పూర్తి చేయాలని కోరారు. అలాగే పనుల ఆలస్యానికి గల కారణాలను వెల్లడించి, పూర్తి చేసే గడువును అధికారికంగా ప్రకటించాలని, లేనిపక్షంలో ప్రజాస్వామ్య పద్ధతిలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ అర్బన్ జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి నల్ల జై శంకర్ గౌడ్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు పులి బలరాం, రవి వర్మ మరియు భవాని నగర్ కాలనీ అసోసియేషన్ సభ్యులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# సీపీఐ నాయకుడు బాబూరావుకు మాతృవియోగం



తెలుగు గళం, కుక్కునూరు: కుక్కునూరు మండల సీపీఐ పార్టీ సహాయ కార్యదర్శి, వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి కురాకుల బాబురావు మాతృమూర్తి కురాకుల రత్తమ్మ (75) అనారోగ్యంతో స్వగ్రామమైన కోమట్లగూడెంలోని ఇంటి వద్ద మృతి చెందారు. సోమవారం సీపీఐ కుక్కునూరు మండల కమిటీ, పలు పార్టీల నాయకులు, మీడియా సభ్యులు అంత్యక్రియల్లో పాల్గొని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. సీపీఐ కుక్కునూరు కార్యదర్శి కొన్నె లక్ష్మయ్య, ఏపీ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్షురాలు వరకా శ్యామల, ద్వారక తిరుమల సెక్రటరీ బాల ఏసు, మైసాక్షి వెంకటాచారి, మడిపల్లి రమణయ్య, టీడీపీ సీనియర్ నాయకులు పిచ్చుక రాజు, వైసీపీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు చిలకా భానుప్రసాద్, నాయకులు గుమ్మడి, సంజీవరావు, మీడియా సభ్యులు మాచర్ల పోతురాజు, రమణయ్య, గోపి తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగ నోటిఫికేషన్లు వెంటనే విడుదల చేయాలి

## బీఆర్ఎస్వీ నేత జంగయ్య డిమాండ్



తెలుగు గళం, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీ ప్రకారం సంవత్సరానికి 2 లక్షల ఉద్యోగాల భర్తీకి సంబంధిం చిన నోటిఫికేషన్ ను వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి జంగయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఓయూ క్యాంపస్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగులు ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారని, ప్రభుత్వం కాలయాపన చేయకుండా తక్షణమే జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించి, ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోతే నిరుద్యోగుల పక్షాన బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ఈ సందర్భంగా జంగయ్య ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

తెలుగు గళం
సామాన్యుల గుండె చప్పుడు జాతీయ తెలుగు దినపత్రిక

# క్రికెట్ నుంచి రాజకీయాలకు..

## బెంగాల్ మంత్రిగా మాజీ భారత పేసర్.!



తెలుగు గళం : మాజీ భారత క్రికెటర్, ఫాస్ట్ బౌలర్ అశోక్ డిండా రాజకీయాల్లో మరో కీలక మైలురాయిని చేరుకున్నారు. పశ్చిమ బెంగాల్‌లో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వ మంత్రివర్గంలో ఆయనకు మంత్రి పదవి దక్కింది. రాజ్‌భవన్‌లో నిర్వహించిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో అశోక్ డిండా రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి శుభేందు అధికారి నేతృత్వంలో జరిగిన మంత్రివర్గ విస్తరణలో మొత్తం 35 మంది మంత్రులు ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్ర గవర్నర్ ఆర్.ఎన్. రవి సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ సీనియర్ నేతలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అశోక్ డిండా రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా మోయ్నా నియోజకవర్గం నుంచి పోటీ చేసిన ఆయన ఘన విజయం సాధించారు. తృణమూల్ కాంగ్రెస్ అభ్యర్థి చందన్ మండల్‌పై 16,241 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఇదే నియోజకవర్గం నుంచి ఆయన వరుసగా రెండోసారి విజయం సాధించారు. 2021 ఎన్నికల్లో కూడా ఆయన తృణమూల్ కాంగ్రెస్ అభ్యర్థి సంగ్రామ్ డోలూయిపై స్వల్ప మెజారిటీతో విజయం సాధించారు.

# ఢిల్లీకి కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు..

## జూన్ 6న నిరసన ప్రదర్శన




తెలుగు గళం : కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే జూన్ 6వ తేదీన ఇండియా రానున్నాడు. ఎంట్రెన్స్ పరీక్షల ఫలితాల అంశంలో నైతిక బాధ్యత తీసుకుని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని నిర్వహించే శాంతియుత ప్రదర్శనలో ఆయన పాల్గొననున్నాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో దీప్కే ఓ వీడియో రిలీజ్ చేశాడు. ఢిల్లీలో జరిగే ఆ నిరసన కార్యక్రమంలో మద్దతుదారులు, విద్యార్థులు పాల్గొవాలని పిలుపు ఇచ్చారు. అందరం దగ్గరకు రావాల్సిన సమయం ఆసన్నమైందని, భారత రాజ్యాంగం అడుగుజాడల్లో.. మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ రాజీనామా డిమాండ్ కోరుదామన్నాడు. మనం మన గళం విప్పితే, దానికి వాళ్లు తప్పకుండా వింటారన్నారు.

జూన్ 6వ తేదీన తన మద్దతుదారులందరూ విమానాశ్రయానికి చేరుకోవాలని తన వీడియో మెసేజ్‌లో పిలుపునిచ్చారు. జూన్ 6, శనివారం ఉదయం నేను ఢిల్లీకి చేరుకుంటానని, అందరూ విమానాశ్రయానికి రావాలని, కలిసికట్టుగా పార్లమెంట్ స్ట్రీట్ పోలీసు స్టేషన్‌కు వెళ్దామని దీప్కే అన్నాడు. జంతర్ మంతర్‌లో శాంతియుత ప్రదర్శన కోసం పర్మిషన్ అడుగుదామన్నాడు. నీటి, సీబీఎస్ఈ లాంటి పరీక్షల సంబంధిత వివాదాల వల్ల విద్యార్థులు ఆందోళన చెందుతున్నారని, ప్రభుత్వం దీనిపై బాధ్యత తీసుకోవాలని దీప్కే అన్నారు. సోషల్ మీడియా ఆధారంగా కాక్రోచ్ జనతా పార్టీ ఏర్పడిన విషయం తెలిసిందే. ఆ పార్టీని సబ్‌స్క్రైబ్ చేస్తున్న వారి సంఖ్య కూడా కోట్లకు చేరుకున్నది.

# కారు కోసం వేధింపులు : విగత జీవిగా ఇన్‌ఫ్లూయెన్సర్



తెలుగు గళం : వరకట్న వేధింపులకు మరో యువతి బలైంది. లక్నోలో ఒక సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ (మాన్సి) తన అత్తవారింట్లో స్థితిలో కన్నుమూసింది. అదనపు కట్నంగా కార్ ఇవ్వలేదనే అక్కసుతోనే మాన్సి భర్త సాగర్ రాజ్‌పుత్, అతని కుటుంబ సభ్యులు ఆమెను హత్య చేసి, ఆత్మహత్యగా చిత్రీకరించడానికి మృతదేహాన్ని ఉరితీశారని మాన్సి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

పోలీసులు నమోదు చేసిన ప్రథమ సమాచార నివేదిక ప్రకారం, కాన్పూర్‌కు చెందిన ఇన్‌ఫ్లుయెన్సర్ మాన్సికి, 2024లో సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ సాగర్ రాజ్‌పుత్‌తో వివాహం జరిగింది. వీరిద్దరూ సోషల్ మీడియాలో చురుకుగా ఉండేవారు, రాజ్‌పుత్‌కు ఇన్‌స్టాగ్రామ్‌లో దాదాపు 8 లక్షల మంది ఫాలోవర్లు ఉన్నారు.

పెళ్లి సమయంలో మాన్సి కుటుంబం రూ. 7 లక్షల నగదు, ఇతర గృహోపకరణాలను ఇలా పలు రకాల బహుమతిలిచ్చింది అయినప్పటికీ, తక్కువ కట్నం తెచ్చిందంటూ ఆమెను శారీరకంగా, మానసికంగా వేధించేవారని, కారు కావాలని ఒత్తిడి తెచ్చారని కుటుంబ సభ్యులు తెలిపారు. పెళ్లైన దగ్గర్నుంచి వేధిస్తూనే ఉండేవారనీ, ఈ వేధింపుల గురించి, తెలిసి పుట్టింటి వారు వారిద్దరి మధ్య రాజీ కుదిర్చేందుకు పలుమార్లు లక్నోకు వెళ్లి మాట్లాడి, సర్ది చెప్పి వచ్చేవారు.

బాధితురాలి కుటుంబం ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్త సాగర్ రాజ్‌పుత్ సహా, మరో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసు అధికారి తెలిపారు. అతని తండ్రి రాజేష్, సోదరుడు అను, ఆడపడుచులు బర్ఖా, చాందిని, అత్త ఆశలపై వరకట్న మరణం కేసు నమోదైంది. ప్రస్తుతం రాజ్‌పుత్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తు న్నారు.

గత రెండు వారాలుగా జాతీయ స్థాయిలో వార్తల్లో నిలిచిన భోపాల్ మోడల్ ట్విషా శర్మ వరకట్న మరణం కేసులో హై-ప్రొఫైల్ సిబిఐ దర్యాప్తు జరుగుతున్న సమయంలోనే, ఈ వరకట్న ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. లక్నోలోనే జరిగిన ఇలాంటి మరో కేసులో, శ్వేతా సింగ్ అనే మహిళ మరణానికి సంబంధించి కూడా వరకట్న వేధింపుల ఆరోపణలు వెల్లువెత్తిన సంగతి తెలిసిందే.

# మయన్మార్ గ్రామంలో పేలుడు..

## 55 మంది మృతి, 74 మందికి గాయాలు



తెలుగు గళం : మయన్మార్ లో జరిగిన పేలుడు ఘటనలో 55 మంది మృతిచెందినట్లు తెలుస్తోంది. షాన్ స్టేట్‌లో ఉన్న కాంగ్ తాట్ గ్రామంలో ఈ ఘటన జరిగింది. ఇది చైనా బోర్డర్‌కు సమీపంలో ఉంటుంది. ఈ దుర్ఘటనలో డజన్ల సంఖ్యలో జనం గాయపడ్డారు. కౌంగ్ తాట్‌లో సుమారు 200 ఇండ్లకు నష్టం జరిగింది. సమీపంలోని పాన్ లోన్ గ్రామంలో మరో 100 ఇండ్లకు నిప్పు అంటుకున్నది. కౌంగ్ తాట్ గ్రామం టీఎన్ఎల్ఏ రెబల్స్ గ్రూపు సంస్థ ఆధీనంలో ఉన్నది. జుంటా మిలిటరీతో ఆ గ్రూపు ఫైట్ చేస్తున్నది. అయితే మైనింగ్ కోసం ఓ వేర్‌హౌజ్‌లో పెట్టిన పేలుడు పదార్థాలు పేలినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. అయితే ఆదివారం రోజునే సుమారు 46 మంది భౌతికదేహాలకు అంత్యక్రియలు నిర్వహించారు. కానీ ప్రమాద ఘటన స్థలం వద్ద ఇవాళ కూడా రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. గాయపడ్డ సుమారు 74 మందిని నామ్‌ఖామ్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఆదివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది.

# హనిమూన్‌కు వెళ్తుండగా హెలికాప్టర్ ప్రమాదం..

## భారతీయ సంతతి పైలట్ మృతి..

## శిథిలాల కింద వధువు




తెలుగు గళం : అమెరికాలోని జార్జియా రాష్ట్రంలో విషాదం చోటుచేసుకున్నది. 25 ఏళ్ల భారతీయ సంతతి పైలెట్ హెలికాప్టర్ ప్రమాదంలో మరణించాడు. తన భాగస్వామిని పెళ్లి చేసుకున్న కొన్ని గంటల్లోనే ఈ ఘటన జరిగింది. ఆ ప్రమాదంలో వధువు సజీవంగా ఉంది. సుమారు 5 గంటల పాటు శిథిలాల కింద ఉన్న ఆమెను చివరకు రక్షించారు. డెల్టా ఎయిర్ లైన్స్‌కు చెందిన రాబిన్‌సన్ ఆర్66 హెలికాప్టర్ ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో పైలెట్‌గా చేస్తున్న మరో వ్యక్తి కూడా చనిపోయాడు. డాసన్ విల్లే కౌంటీలో జరిగిన ప్రమాదంలో భారతీయ మూలాల ఉన్న దవే ఫిజి కూడా ప్రాణాలు కోల్పోయాడు. ఆయన భార్య జెస్సీకి గాయాలయ్యాయి. ఆస్పత్రిలో ఆమె చికిత్స పొందుతోంది.

ప్రమాదం జరగడానికి కొన్ని గంటల ముందు దవే ఫిజి జంట పెళ్లి చేసుకున్నది. డాసన్‌విల్లే సమీపంలో ఉన్న ద రివరీ వెడ్డింగ్ వేదికలో ఆ జంట పెళ్లి జరిగింది. వివాహ వేడుక పర్ఫెక్ట్‌గా జరిగిందని, కానీ అట్లాంటాలో ఉన్న హోటల్‌కు వెళ్లేందుకు హెలికాప్టర్‌లో ప్రయాణిస్తుండగా ప్రమాదం జరిగిందని కుటుంబసభ్యులు తెలిపారు. దవే తల్లితండ్రులు కేరళలోని ఎర్నాకుళం జిల్లా నుంచి అమెరికాకు వలసవెళ్లారు. కుమారుడి మరణం ఘటనతో ఆ పేరెంట్స్ విలపిస్తున్నారు.

వాస్తవానికి పెళ్లి వేడుక ముగిసే వరకు రాత్రి 9 దాటిందని, ఆ సమయంలో వర్షం కురుస్తోందని, పొగ మంచు కూడా ఎక్కువగా ఉన్నట్లు దవే తండ్రి జార్జ్ ఫిజీ తెలిపారు. ఇలాంటి వాతావరణంలో గగన ప్రయాణం ఇబ్బందికరమే అని తన కుమారుడు కూడా ఆందోళన వ్యక్తం చేశాడని తండ్రి జార్జ్ గుర్తు చేశారు. అయితే హయ్యర్ ఆల్టిట్యూడ్‌లో కొత్త జంటను తీసుకెళ్తానని హెలికాప్టర్ పైలెట్ చెప్పడంతో ప్రయాణం జరిగిందని, కానీ డాసన్ విల్లే వద్ద ఉన్న కొండల్లో ఆ విమానం కూలినట్లు గుర్తించామన్నారు.

రెస్క్యూ బృందాలు హెలికాప్టర్ ప్రమాద ప్రాంతానికి చేరుకునే వరకు సుమారు 5 గంటల పాటు శిథిలాల కిందే జెస్సీ ఉన్నట్లు చెప్పారు. వృత్తి రీత్యా జెస్సీ ఓ నర్సు. ప్రమాదంలో ఆమెకు ఫ్రాక్చర్లు కాలేదు. కానీ తీవ్రమైన రీతిలో దెబ్బలు తగిలాయి. ప్రమాదం పట్ల నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డు విచారణ చేపట్టింది. 30 రోజుల్లో నివేదిక రానున్నది.

# నిరుద్యోగులపై 'గొడ్డలిపార్టీ' కక్షసాధింపు:

## శాప్ ఛైర్మన్ రవినాయుడు



అమరావతి,తెలుగు గళం : జగన్‌కు ఓట్లు వేయలేదని నిరుద్యోగులపై 'గొడ్డలి పార్టీ' కక్ష సాధిస్తోందని శాప్ ఛైర్మన్ రవినాయుడు ధ్వజమెత్తారు. డీఎస్సీ పోస్టుల భర్తీలో స్పోర్ట్స్ కోటాలో అవినీతి జరిగిందని ఆరోపిస్తున్న గొడ్డలిపార్టీ దానిని నిరూపించాలని సవాల్ విసిరారు. డీఎస్సీ జరగకుండా రూ. కోట్లు ఖర్చుపెట్టి కోర్టుల్లో తప్పుడు కేసులు వేశారని మండిపడ్డారు. తాజాగా యూనివర్సిటీ పోస్టుల భర్తీని, మరో డీఎస్సీని అడ్డుకోవడానికే తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని రవినాయుడు స్పష్టం చేశారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా.. ఉద్యోగాల భర్తీ ఆగబోదని తెలిపారు. కష్టపడి డీఎస్సీ ఉద్యోగాలు సాధించిన వాళ్లు ఆందోళనలో ఉన్నారని చెప్పారు.

# ఇకనైనా రెచ్చగొట్టే కుట్రలను వైకాపా వీడాలి: మంత్రి అనగాని సత్యప్రసాద్



మంగళగిరి,తెలుగు గళం :: ఇకనైనా కుల, మత విధ్వంసాలు, రెచ్చగొట్టే కుట్రలను వైకాపా వీడాలని ఏపీ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. నంద్యాలలో వైఎస్సార్ విగ్రహం ధ్వంసం ఘటనపై ఆయన మీడియాతో మాట్లాడారు. వైఎస్సార్ విగ్రహాన్ని వైకాపా వాళ్లే ధ్వంసం చేసి తెదేపాపై నెట్టాలని చూస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు భంగం కలిగించేందుకు వైకాపా కుట్రలు చేస్తోందన్నారు.

"దుష్ప్రచారాలు చేయడమే వైకాపా నాయకులు పనిగా పెట్టుకున్నారు. వైకాపా నాయకుడు జంబులయ్యనే విగ్రహాన్ని ధ్వంసం చేసినట్లు తేలింది. ఈ కుట్రలో తెదేపాను ఇరికించేందుకు వైకాపా ప్రయత్నం చేసింది. విగ్రహ ధ్వంసం కుట్ర బహిర్గతం కాగానే దృష్టి మళ్లించడానికి డీఎస్సీపై పడ్డారు. డీఎస్సీ పారదర్శకంగా నిర్వహించినా దుష్ప్రచారం చేస్తున్నారు. అబద్ధాల పునాదులపై పుట్టిన పార్టీ వైకాపా. రాష్ట్రాభివృద్ధిని ఆ పార్టీ ఓర్వలేకపోతోంది"అని మంత్రి అన్నారు.

# ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి కీలక ముందడుగు.. ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



తెలుగు గళం : నాచారం ప్రధాన రహదారి పై హబ్సిగూడ నుంచి నాచారం వైపు వెళ్లే మార్గంలో ఉన్న ఐఐసీటీ ఇన్‌స్టిట్యూట్, క్వార్టర్స్ మధ్య ఏర్పడిన బాటిల్‌నెక్ రోడ్డు సమస్య పరిష్కారానికి కీలక చర్యలు ప్రారంభమయ్యాయి. హబ్సిగూడ చౌరస్తా నుంచి నాచారం హెచ్‌ఎంటీ వరకు రహదారి ఇరుకుగా ఉండడంతో తరచూ ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ సమస్య పై గత కొంతకాలంగా నిరంతరం కృషి చేస్తున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రయత్నాల ఫలితంగా రోడ్డు విస్తరణకు మార్గం సుగమమవుతోంది. ఈ సందర్భంగా ఐఐసీటీ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డితో సోమవారం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సమావేశమై రహదారి విస్తరణ అంశం పై చర్చించారు. ప్రస్తుతం ఉన్న రహదారికి ఇరువైపులా సుమారు 20 అడుగుల చొప్పున స్థలం ఇవ్వడానికి ఐఐసీటీ యాజమాన్యం సానుకూలంగా ఉన్నట్లు డైరెక్టర్ తెలిపారు.

అయితే, పెరుగుతున్న జనాభా, విద్యాసంస్థల వాహనాల రద్దీ, అలాగే చర్లపల్లి రైల్వే స్టేషన్ అందుబాటులోకి రావడంతో ఈ ప్రాంతంలో ట్రాఫిక్ ఒత్తిడి రోజురోజుకూ పెరుగుతోందన్నారు. ఈ నేపథ్యంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని మాస్టర్ ప్లాన్ ప్రకారం రహదారి మధ్య నుంచి తగిన వెడల్పుతో పూర్తి స్థాయి రోడ్డు విస్తరణ చేపట్టాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి డైరెక్టర్‌ను కోరారు. ఈ ప్రతిపాదన పై కేంద్ర కార్యాలయానికి సమగ్ర నివేదిక పంపించి తదుపరి చర్యలు చేపడతామని ఐఐసీటీ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు. రోడ్డు విస్తరణ పూర్తయితే ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గడంతో పాటు ప్రజల రాకపోకలు సులభతరం అవుతాయని, ప్రాంతీయ అభివృద్ధికి కూడా ఇది దోహదపడుతుందని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తెలిపారు.

# చెన్నూరులో ఎస్‌బీఐ ఎదుట గోల్డ్ లోన్ బాధితుల ఆందోళన



తెలుగు గళం : మంచిర్యాల జిల్లా చెన్నూర్ పట్టణంలోని ఎస్‌బీఐ బ్రాంచ్-2 ఎదుట గోల్డ్ లోన్ బాధితుల రిలే నిరాహార దీక్షలు రెండో రోజుకు చేరుకున్నాయి. బ్యాంకు ఎదుట టెంట్లు ఏర్పాటు చేసి బాధితులు రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తున్నారు. ఈ దీక్షలకు మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు సాధనబోయిన కృష్ణ మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బ్యాంకు అధికారుల నిర్లక్ష్య వైఖరి సరికాదని, బాధితులకు న్యాయం జరిగే వరకు నిరాహార దీక్షలు కొనసాగిస్తామని, వారికి కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతు ఉంటుందని చెప్పారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఎస్‌బీఐ పై ఖాతాదారులకు ఉన్న నమ్మకం దెబ్బతింటోందని ఆయన అన్నారు. ఖాతాదారుల బంగారు ఆభరణాలను మేనేజర్, క్యాషియర్, ఇతర సిబ్బంది కలిసి దొంగతనం చేశారని ఆరోపించారు. దొంగిలించబడిన బంగారు ఆభరణాలను పోలీసులు రికవరీ చేసినప్పటికీ, వాటిని ఖాతాదారులకు ఎందుకు అప్పగించడం లేదని బ్యాంకు అధికారులను ప్రశ్నించారు. గోల్డ్ లోన్ బాధితులు తమ రుణ బకాయిలు చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ, తమ బంగారు ఆభరణాలను తిరిగి ఇవ్వాలని గత తొమ్మిది నెలలుగా బ్యాంకు చుట్టూ తిరుగుతున్నారని, అయినా అధికారుల్లో ఎలాంటి చలనం కనిపించడం లేదని మండిపడ్డారు. సమస్య పూర్తిగా పరిష్కారమయ్యే వరకు బ్యాంకు ఎదుట ప్రతిరోజూ రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. బ్యాంకు ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి బాధితులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

Printed and Published by BARISHETTI SRIKANTH on be half Of Telugu galam
H.No: H.NO: 8-2-293/82/BJR/127, BJR NAGAR, FILM NAGAR, GREATER HYDERABAD(M.CORP), PO:JUBILEE HILLS, HYDERABAD, TELANGANA - 500033.
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.